క్లుప్తంగా

గొండుపాలెంలో ఫ్యామిలీ ఫిజిషియన్



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

కె.కోటపాడు : వైద్యం పొందలేని పరిస్థితిలో ఉన్న వారి ఇంటికే వెళ్లి వైద్య సేవలందించనున్నట్లు చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణి నిర్మల అన్నారు. గొండుపాలెం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా 121 మందికి ఓపీ సేవలందించారు. 14 మందికి వారి ఇంటికే వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిర్మల మాట్లాడుతూ వృద్ధులు, చిన్నారులు శీతాకాలంలో ఆరోగ్య జాగ్రత్తలను పాటించడం ముఖ్యమన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి తిలక్, ఎంపీహెచ్ఈవో కె.వి.రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ డీఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

వంట పాత్రల వితరణ

చోడవరం రూరల్: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం) నిర్వహణకు వీలుగా వంట పాత్రలతోపాటు గ్యాస్ స్టౌలను ప్రవాస భారతీయులు సమకూర్చారు. అమెరికాలో నివాసం ఉంటున్న ప్రవాస భారతీయులు ఇమంది చంద్రాదిత్య, అట్టాడ రోహిత్, కలిదిండి శ్రీకాంత్, చిగురుపాటి మణితేజ, శృంగవరపు సత్యనారాయణలు సోమవారం సుమారు రూ.30 వేల విలువైన ఈ సామగ్రిని మండల విద్యాశాఖాధికారి ఎన్.శ్రీనివాసరావు సమక్షంలో హెచ్ఎం బి.రవికళకు అందించారు. కార్యక్రమంలో మహాలక్ష్మినాయుడు, కుమారి, వరలక్ష్మి, బుచ్చి రాజమ్మ, రవిశంకర్‌లు పాల్గొన్నారు.

గ్రామ సభలతో గ్రామాభివృద్ధి

రోలుగుంట : గ్రామ సభల నిర్వహణ ద్వారా గ్రామాభివృద్ధి సాధ్యపడుతుందని ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు అన్నారు. కొమరవోలు, కొండపాలెం మినహా మండలంలోని 22 పంచాయితీల్లో సోమవారం గ్రామ సభలను ఆయా పంచాయితీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సభల్లో పంచాయితీ కార్యదర్శులు పంచాయతీ నిధుల వినియోగం, అలాగే ప్రజల నుంచి వచ్చిన సమస్యలు, అభివృద్ధి పనులకు సంబంధించి ప్రణాళికలను చదివి వినిపించారు. గ్రామాల్లో అధికంగా తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు సభ దృష్టికి వచ్చాయి. వడ్డిప, రత్నంపేట, బుచ్చింపేట తదితర సభలను పర్యవేక్షించిన ఈవోపీఆర్డీ జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటి సమస్య తీరనుందని భరోసా ఇచ్చారు. న్నారు. బుచ్చింపేటలో పంచాయితీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ నిర్వహించిన సభలో సర్పంచ్ ఉలబాల చంద్ర, ఎంపీటీసీ సభ్యురాలు ఉలబాల సత్యవతి పాల్గొన్నారు.

మేలుకొలుపు సభ్యుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న మేలుకొలుపు బృందాల సభ్యులు

బుచ్చెయ్యపేట : మండలంలోని పెదపూడి గ్రామంలో బుచ్చెయ్యపేట, రావికమతం, చోడవరం మండలాలకు చెందిన మేలుకొలుపు బృంద సభ్యుల మహా సమ్మేళనం సోమవారం నిర్వహించారు. గ్రామాల్లో హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీ కృష్ణ చరణానంద భారతీ స్వామి కోరారు. పూర్వ కాలం నుండి వస్తున్న తెలుగు సంస్కృతిని, హిందూ సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గ్రామాల్లో రాత్రిపూట ఆలయాల్లో భజనలు, భక్తి పాటలు పాడటం ద్వారా స్నేహభావం పెరిగి ఆధ్యాత్మికత ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాలకు చెందిన పలువురు నాయకులు, సమరసతా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య సీఎం లక్ష్యం

చీడికాడ: నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని జిల్లా సమగ్ర శిక్ష ప్లానింగ్ కో–ఆర్డినేటర్ శ్రీలక్ష్మి అన్నారు. సోమవారం ఆమె మండలంలోని మంచాల మోడల్ స్కూల్, బైలపూడి జెడ్పీ స్కూల్, చీడికాడ ప్రభుత్వ హైస్కూల్, ఎంపీపీ స్కూల్, ఎంఈవో కార్యాలయాలను సందర్శించారు. ఈ మేరకు డిజిటల్ తరగతి గదులను పరిశీలించారు. ఈ సౌకర్యాలను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. బైజూస్ కంటెంట్‌ను వినియోగించి సృజనాత్మక బోధనను పిల్లలకు అందించాలని సూచించారు.

ఉత్తర ద్వార దర్శనం.. పునర్జన్మ విహీనం

- కిటకిటలాడిన వైష్ణవాలయాలు
- వైకుంఠ ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు

'వ్యక్తిర్ ముక్తిర్ మవాప్నోతి ఉత్తర ద్వార దర్శనాత్'.. ఉత్తర ద్వార దర్శనాన్ని చేసుకునే వ్యక్తికి తప్పక ముక్తి లభిస్తుందని ఈ శ్లోకం పరమార్థం. మూడు కోట్ల ఏకాదశులకు సమానమైన ముక్కోటి ఏకాదశి నాడు.. వైకుంఠ వాసుని మనసారా కొలిచేందుకు భక్తులు ఉత్తరద్వార దర్శనానికి పోటెత్తారు. వైష్ణవాలయాలతోపాటు, కొన్ని చోట్ల శివాలయాలు కూడా ఉత్తర ద్వారాల వద్ద, శ్రీవేంకటేశ్వరుని విగ్రహాన్ని ఉంచి, భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు.



చోడవరం ఆపద శ్రీనివాసస్వామి క్షేత్రంలో పూజలు చేస్తున్న అర్చకులు



చోడవరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో టీటీడీ దాసరి సాహిత్య బృందం కోలాటం



మాడుగుల వాసవీ మాత ఆలయంలో..



రోలుగుంట వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



ప్రత్యేక అలంకరణలో సత్యనారాయణస్వామి



రావికమతం శివాలయంలో భక్తుల పూజలు



నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు



ఎం.బి.పట్నంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



చిననందిపల్లి హరినామ సంకీర్తనలో భక్తజనం



అర్జునగిరి వరాహలక్ష్మీనృసింహస్వామి పల్లకీ సేవ



కేజే పురం కల్యాణ వేంకటేశ్వరుడి ఆలయంలో..



మాడుగుల వేంకటేశ్వరాలయంలో భక్తులు

చోడవరం: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని భక్తులంతా భక్తిశ్రద్ధలతో జరిపారు. స్వామివారి ఉత్తర ద్వార దర్శనం, ఏకాదశి పూజలతో వైష్ణవాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. చోడవరం శ్రీ ఆపదహర శ్రీనివాస క్షేత్రంలో శ్రీ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. ఇక్కడి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీ కేశవస్వామి ఆలయం, గోవాడ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఉత్తర ద్వారదర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. టీటీడీ దాససాహిత్య మహిళ బృందం కోలాటం అందర్నీ ఆకట్టుకుంది. ఆలయ అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు పప్పల జయదేవ్, ట్రస్టు బోర్డు చైర్మన్ కందర్ప మాధురీ శంకర్, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, ఆలయ కమిటీ డైరెక్టర్లు పాల్గొని ప్రసాదం పంపిణీ చేశారు. శ్రీ కేశవస్వామి దేవాలయంలో మహాభారతం, భాగవత ఘట్టాలను వివరిస్తూ ఆలయ ప్రధాన అర్చకుడు సీతారామాచార్యులు ప్రవచనాలు చేశారు. గోవాడ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుగర్ ఫ్యాక్టరీ ఎమ్‌డీ సన్యాసినాయుడు, ఏఓ పప్పల రమణమూర్తి పాల్గొని పూజలు చేశారు.

మాడుగుల: స్థానిక పార్థసారథి స్వామి ఆలయంలో రుక్మిణీ, సత్యభామలతో ఉన్న పార్థసారథి స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పూలు, నగలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కోటబయలు వెలసిన వేంకటేశ్వరాలయంలో ముక్కోటి ఏకాదశి పూజలు నిర్వహించారు. కోటకు తూర్పున వెలసిన సీతారామస్వామి ఆలయంలో సీతారామ లక్ష్మణులను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. అలాగే స్థానిక వాసవీమాత ఆలయంలో ముక్కోటి ఏకాదశి ప్రత్యేక పూజల్లో భారీగా భక్తులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని మేడిచర్ల గ్రామంలోని కేశవ స్వామి ఆలయంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. చౌడువాడ సతకం పట్టు వద్ద ముక్కోటి ఏకాదశి సందర్భంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు.

దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తజనానికి ఉత్తరద్వార దర్శనం కల్పించారు. దేవరాపల్లిలో వెంకన్న స్వామిని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరీ, భాస్కరరావు దంపతులు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు దర్శించుకున్నారు. వనదేవీశ్వర, తిమిరాం ఉమామహేశ్వరీ ఆలయాల్లో కూడా భక్తులు బారులు తీరారు.

రావికమతం : మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి పూజలు భక్తి శ్రద్ధలతో చేశారు. రావికమతం, కొత్తకోట, మేడివాడ శివాలయంలో భక్తులు వైకుంఠ ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.

మాడుగుల రూరల్: కె.జె.పురం వేగి వారి కల్లాలు వద్దనున్న శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. స్వామి వారిని మాజీ ఎమ్మెల్యే రామానాయుడు, దేశం నేత పైలా ప్రసాదరావు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు.

నాతవరం: మండలంలోని ఎం.బి.పట్నం రామాలయంలో విశ్రాంత జేడీఏ వర్రే వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వర్రే సత్యనారాయణ అధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెదురుపల్లిలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం, మాధవనగరం మర్రిపాలెం వైష్ణవాలయాల్లో పూజలు నిర్వహించారు.

రోలుగుంట: స్థానిక కొండపైన వెలసిన శ్రీ వేంకటేశ్వర ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ సత్యన్నారాయణ ఆధ్వర్యంలో స్వామివారిని అభరణాలు, పూలతో అలంకరించారు. నర్సీపట్నం మండలం చెట్టుపల్లి గ్రామానికి చెందిన సుంకర వారి కుటుంబాలు సుమారు 80 మంది బృందంగా వచ్చి స్వామి వారికి తొలిపూజ చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు అభిషేకాలు చేశారు.

మాకవరపాలెం: మండలంలోని తామరంలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తెల్లవారుజామున భక్తులు నగర సంకీర్తన చేశారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ప్రభాకరరాజు, రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం: శ్రీసత్యనారాయణస్వామి, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు పెరివిల్లి భద్రాచలరామం నిర్వహించిన వేడుకలో సత్యనారాయణస్వామి దేవస్థానం చైర్మన్ శెట్టి మోహన్, న్యాయవాది ప్రభాకర్ దంపతులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: స్థానిక సీతారామాంజనేయ స్వామి వారి ఆలయంలో కోదండ రామ భజన బృందం గ్రామ ప్రజల సహాయ సహకారాలతో హరేరామ హరే కృష్ణ, గోవింద నామస్మరణం చేపట్టారు.

చీడికాడ: అర్జునగిరి స్వయంభూ వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనంలో భక్తులు పాల్గొని ఉత్సవ మూర్తుల పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బోడాల రమాశ్రీనివాస్, పెద్దలు జె.సత్యనారాయణ, అడ్డెపల్లి నర్సింమూర్తి, పెంటకోట ఈశ్వరరావు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



సచివాలయ ఉద్యోగుల డైరీని ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి : ఉప ముఖ్యమంత్రి, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడును డెమోక్రటిక్ అసోసియేషన్ ఆఫ్ గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు సోమవారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ముందుగా ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సచివాలయ ఉద్యోగుల సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన చేతులు మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించి, తగు చర్యలు తీసుకుంటామన్నారని అసోసియేషన్ ప్రతినిధులు ఆర్.నూతన్‌కుమార్‌రెడ్డి, జోసెఫ్ కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ శానిటేషన్, ఎన్విరాన్మెంటల్ సెక్రటరీల సంఘం అధ్యక్షుడు మల్లాది ప్రసాద్, సభ్యులు ఎం. శ్రీనివాస్, కె.అశోక్‌కుమార్, కె.సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పెంపు.. ఆనందం రెట్టింపు!

పింఛన్ లబ్ధిదారులకు పండగ పక్షం రోజులు ముందే వచ్చింది. పెంచి రూ.250 కలిపి మొత్తం రూ.2,750 పెన్షన్ పంపిణీ కార్యాక్రమం రెండో రోజూ కొనసాగింది. గ్రామాల్లోనైతే పింఛన్ అందుకున్న అవ్వాతాతల ఆనందానికి హద్దే లేదు. తమ మనుమడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెయ్యేళ్లు వర్ధిల్లాలని, మళ్లీ ఆయనే సీఎంగా రావాలని నిండు మనసుతో ఆశీర్వదిస్తున్నారు.

- ఊరూవాడా పండగలా పింఛన్ల పంపిణీ



ఎం.కె.వల్లాపురంలో నూతన పింఛనుదారులతో సర్పంచ్, ఉప సర్పంచ్



ఆనందపురంలో లబ్ధిదారులకు పెన్షన్లను అందిస్తున్న సర్పంచ్ అప్పాజీ



గ్రామ సభలో పింఛన్లు పంపిణీ చేసిన వైస్ ఎంపీపీ రాజారామ్



ఎం.అలమండలో పింఛన్లు అందిస్తున్న గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాడి జగన్



గిరిజన గ్రామం చలిసింగంలో పింఛన్ ఇస్తున్న సర్పంచ్ గంగరాజు, సచివాలయ కన్వీనర్

మాడుగుల : మండలంలోని జమ్మాదేవిపేట సచివాలయ పరిధిలో గాదిరాయి, జేడీపేట, ఎల్. గవరవరం గ్రామాల్లో సోమవారం రెండో రోజూ పింఛన్ల పంపిణీ జరిగింది. వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారాం చేతుల మీదుగా కొత్తగా మంజూరైన 17 పింఛన్లతోపాటు మొత్తం 719 పింఛన్ల పంపిణీ ప్రక్రియ రెండో రోజూ కొనసాగింది. కార్యక్రమంలో సర్పంచ్‌లు కొసిరెడ్డి కృష్ణమూర్తి, పెంటకోట జగన్నాథరావు, పంచాయతీ కార్యదర్శి వెచ్చా రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పర్రే రామునాయుడు, పర్రే వెంకటరమణ, వలంటీర్లు పాల్గొన్నారు.

● అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ అన్నారు. వీరనారాయణం సచివాలయంలో సర్పంచ్ వై.కొండఅప్పారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన గ్రామ సభలో పాల్గొని మాట్లాడారు. గ్రామంలో ప్లాస్టిక్ వాడకం నిషేధించాలని, గ్రామంలో మరమ్మతుకు గురైన తాగునీటి బోర్లను బాగు చేయించి, ఇంటింటికీ తాగునీరందించాలని తీర్మానించారు. అనంతరం పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు విస్సారపు రామారావు, ఎంపీటీసీ దాడి నూకరత్నం, పీఏసీఎస్ సీఈవో తూరుబిల్లి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ తూరుబిల్లి సత్యంబాబు, మాజీ ఎంపీటీసీ దాడి సుబ్బలక్ష్మి, పంచాయితీ కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.

కె.కోటపాడు : ఎన్నికల కాలంలో ప్రజలకు సీఎం జగన్ ఇచ్చిన హామీలలో 98 శాతం అమలు చేశారని ఆనందపురం సర్పంచ్ వంటాకు అప్పాజీ అన్నారు. సోమవారం పంచాయితీ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు పెన్షన్ అందించారు. కార్యక్రమలో మాజీ సర్పంచ్ బంగారునాయుడు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : ఎం.కోటపాడులో సర్పంచ్ శేషఫణి, ఉప సర్పంచ్ శానాపతి గంగాధర్ చేతులు మీదుగా ఇద్దరికి, ఎం.కె.వల్లాపురంలో ఇద్దరికి సర్పంచ్ కోట్ని లక్ష్మి, ఉప సర్పంచ్ కరణం రాము చేతులు మీదుగా అందించారు. అలాగే వీరనారాయణం గ్రామంలో నలుగురికి, మండల వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ చేతులు మీదుగా కొందరికి పింఛన్లు పంపిణీ చేశారు.

దేవరాపల్లి : ఎం.అలమండలో స్థానిక సర్పంచ్, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాడి జగన్, ఎంపీటీసీ పోతల వెంకటరావు, వీఆర్వో పోతల శంకరరావు చేతుల మీదుగా నూతన పింఛన్ల పంపిణీ జరిగింది. మామిడిపల్లిలో స్థానిక సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, ఉప సర్పంచ్ చల్లా సుధాకర్, చల్లా మహేష్ చేతులు మీదుగా పింఛన్లు అందజేశారు.

● ఎం.కోటపాడు సచివాలయంలో సర్పంచ్ శేషఫణి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఉప సర్పంచ్ గంగాధర్, కార్యదర్శి తిరుమలదేవి, వీఆర్వో శ్రీనివాసరావు తదితర్లు మాట్లాడారు. కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదార్లకు అందించారు. మండలంలో వల్లాపురం, వీరనారాయణం తదితర గ్రామాలల్లో గ్రామ సభలు నిర్వహించారు.

రావికమతం: ఎంపీపీ పైల రాజు, జెడ్పీటీసీ సభ్యులు తలారి రమణమ్మ, మండల ఆగ్రో అడ్వైజరీ కమిటీ చైర్మన్ కంచిపాటి జగన్నాథరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, చోడవరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజాన నర్సింహులు, డైరెక్టర్ ఆధికారి రాజు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి పింఛన్లను అందించారు.

విద్యతోనే సమగ్ర అభివృద్ధి



విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. గొలుగొండ గురుకుల కళాశాలలో 8వ తరగతి విద్యార్థులు 79 మందికి సోమవారం బైజూస్ ట్యాబ్‌లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధి ద్వారా తరాల తలరాతను మార్చాలన్న దృఢ సంకల్పంతోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. ట్యాబ్‌ల ద్వారా పేద విద్యార్థులు కూడా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు వెసులుబాటు దక్కిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేయడం గర్వకారణమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాలను వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత భవిష్యత్తును అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, వైస్ ఎంపీపీలు జక్కు నాగమణి, సుర్ల బాబ్జి, వైఎస్సార్‌సీపీ మండల, యూత్, మహిళా అధ్యక్షులు లెక్కల సత్యన్నారాయణ, రామకృష్ణనాయుడు, సుజాత, సర్పంచ్ అప్పారావు, కళాశాల ప్రిన్సిపాల్ రుత్తల రామకృష్ణ, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు పోటెత్తిన జనం



వడ్డాదిలో గిరిజాంబ కొండ చుట్టూ గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

బుచ్చెయ్యపేట : ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వరస్వామి గిరి ప్రదక్షిణకు భక్తులు పోటెత్తారు. సోమవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఏర్పాటు చేసిన గిరి ప్రదక్షిణకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తెల్లవారుజాము నుంచే గిరిజాంబ కొండపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం కల్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా తయారు చేసిన రథంపై స్వామి వారి చిత్ర పటాలను ఉంచి భజనలు, భక్తి పాటలు, జ్యోతులతో స్వామి వారి గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. గిరిజాంబ కొండ చుట్టూ 9 కిలోమీటర్ల మేర గిరి ప్రదక్షిణ సాగింది. శ్రీవారి సేవా సభ్యులు, భజన బృందాలు, మహిళలు ఉత్సాహంగా గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. కమిటీ సభ్యులు, ఈవో శర్మ తగిన ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రం బుచ్చెయ్యపేట కొండపై ఉన్న వెంకటేశ్వర స్వామి, వడ్డాది కొత్తూరు గీతాశ్రమంలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోలు

నాతవరం: రైతులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కోనుగోలు చేయాలని తహసీల్దార్ పి.కనకారావు సంబంధిత అధికారులను సూచించారు. సివిల్ సప్లై అధికారులతో సోమవారం తన కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో నాతవరం మండలంలోనే ఖరీఫ్ సీజన్‌లో అధిక విస్తీర్ణంలో రైతులు వరి పంట సాగు చేశారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అధికారులు నేరుగా కల్లాల వద్దకే వెళ్లి ధాన్యం కోనుగోలు చేయాలన్నారు. ఎక్కడైన మిల్లర్లు రైతులను ఇబ్బందులు పెడితే తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై ఏఎస్‌వో నందకిశోర్, డిప్యూటీ తహసీల్దార్, సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై సత్వర చర్యలు

అధికారులకు ఆర్డీవో భవానీ శంకర్ సూచన



స్పందనలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో భవానీశంకర్

నర్సీపట్నం: స్పందనలో వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలని ఆర్డీవో భవానీశంకర్ అధికారులకు సూచించారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమ వారం నిర్వహించిన స్పందనలో ఆర్డీవో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. స్పందనలో 18 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ఎక్కువగా భూ సంబంధిత ఫిర్యాదులున్నాయి. స్పందనపై ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా అధికారులు పని చేయాలన్నారు. స్పందన ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించకుండా, సత్వర పరిష్కారం చూపాలన్నారు. పరిష్కరించేందుకు ఆస్కారం లేకపోతే సంబంధిత విషయాన్ని లిఖితపూర్వకంగా అర్జీదారుకు తెలియజేయాల్సిన బాధ్యత తమదేనన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.వి.రమణ, సీడీపీవో మేరీ సువార్త, ఏపీఈపీడీసీఎల్ ఏడీఏ సత్యానందం, హౌసింగ్ డీఈ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

1364 మందికి కొత్త పింఛన్లు

- అర్హులైన వారందరికీ లబ్ధి
- ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్



లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్

నాతవరం/గొలుగొండ: రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పింఛన్లు అందిస్తున్నామని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అన్నారు. నాతవరం, గొలుగొండ మండల కేంద్రాల్లో సోమవారం కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో పాతవి 7 వేలకు పైగా పింఛన్లుండగా, కొత్తగా 1364 మందికి పింఛన్లు మంజూరైనట్టు వెల్లడించారు. ఈ నెల నుంచి పాత పింఛన్‌దారులతో పాటు కొత్తవారికి కూడా ఒక్కొక్కరికి రూ.2,750 చొప్పున వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్ అందిస్తారని తెలిపారు. గత ప్రభుత్వంలో పింఛన్లు పొందాలంటే.. అప్పటికే పింఛన్ పొందుతున్న వారిలో ఎవరైనా చనిపోతే తప్ప కొత్త పింఛన్లు వచ్చేవి కాదన్నారు. అది కూడా జన్మభూమి కమిటీ సభ్యులను ప్రసన్నం చేసుకుంటేనే పింఛన్లు వచ్చేవని ఎద్దేవా చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాజకీయాలతో ప్రమేయం లేకుండా అర్హత ఉండి సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే వలంటీర్లే లబ్ధిదారుని ఇంటికి వెళ్లి పింఛన్లు అందిస్తున్నారన్నారు. ఎన్నికలు ముందు ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 98 శాతం హామీలు నేరవేర్చారని కొనియాడారు. ఈ విషయాన్ని ప్రజలంతా గ్రహించాలని కోరారు.

అనంతరం నాతవరం సర్పంచ్ గొలగాని రాణి, ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి జెడ్పీటీసీ సభ్యులు కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీ పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, మండల పార్టీ అధ్యక్షుడు పైల పోతురాజు, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శిరుసుపల్లి నర్సింగరావు, ఎంపీటీసీ సభ్యులు ఇనపసప్పల పుష్ప, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై సభలో మాట్లాడారు. కార్యక్రమాల్లో నర్సీపట్నం మార్కెట్‌యార్డు చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు సుర్ల బాబ్జి, జక్కు నాగమణి, మండల మహిళా అధ్యక్షురాలు లోచల సుజాత, పార్టీ యూత్ అధ్యక్షుడు రామకృష్ణనాయుడు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, ఎంపీడీవోలు లోకుల యాదగిరీశ్వరరావు, డేవిడ్‌రాజు, తహసీల్దార్ ఆనందరావు, స్థానిక సర్పంచ్ కసిపల్లి అప్పారావు, ఎంపీటీసీ చినపాపతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.